ప్రజాశక్తి
బుధవారం 20 మార్చి 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అసంతృప్తుల కూటమి



వంశీకృష్ణ పోస్టర్లును తగులబెడుతున్న జనసేన కార్యకర్తలు

- కూడికలు, తీసివేతల్లో టిడిపి, జనసేన తర్జనభర్జనలు
- దక్షిణం సీటుపై పునరాలోచన తప్పదా ?
- భీమిలిపై కొనసాగుతున్న మీమాంశ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లా అసెంబ్లీ, పార్లమెంట్ సీట్ల పంచాయతీ కూటమికి పలు స్థానాల్లో తలబొప్పి కట్టిస్తోంది. టికెట్ల కేటాయింపుల్లో అసంతృప్తులు పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా విశాఖ పార్లమెంట్ స్థానంపై బిజెపి, జనసేన, టిడిపి కూటమి ఒక అవగాహనకు రాలేని పరిస్థితులు కొనసాగుతున్నాయి. గీతం విద్యాసంస్థల అధినేత భరత్‌కే సీటు ఖరారైనట్లు మంగళవారం నాటికి తెలియడంతో నగరంలో టిడిపి శ్రేణుల్లో ఉత్సాహ వాతావరణం కనిపించింది. ఇదిలా ఉండగా ఎంపీ టికెట్‌ను బిజెపి ఆశించిన విషయం తెలిసిందే. అయితే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను వంద శాతం అమ్మేయాలని మోడీ నిర్ణయించడం, వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేయడం, రైల్వేజోన్ ఉత్తివాటగానే నిలవడం వంటి కారణాలతో ఇక్కడ ఆ పార్టీ అభ్యర్థి ఎవరు నిల్చున్నా డిపాజిట్లు కూడా దక్కవంటూ టిడిపి శ్రేణులు బాహాటంగానే పేర్కొన్నాయి. పైగా భరత్ ఎంపీగా పోటీచేసి గతంలో తక్కువ ఓట్లతో ఓటమి చెందారు. సదరు వ్యక్తికే టికెట్ ఇవ్వాలన్న పట్టు టిడిపి, జనసేన శ్రేణుల నుంచి ఏకోన్ముఖంగా వినిపించింది. ఈ క్రమంలోనే భరత్‌కు ఎంపీ టికెట్ కేటాయించినట్లు తెలుస్తోంది.

అసెంబ్లీ సీట్లపై వాస్తవిక దృష్టి లోపించిందా ?

కూటమి నేతలు కొన్ని టికెట్ల కేటాయింపులో వాస్తవికతను మరిచారన్న చర్చ టిడిపి, జనసేన కిందిస్థాయిలో నెలకొంది. అందులో ప్రధానమైనది నగరంలోని దక్షిణం అసెంబ్లీ సెగ్మెంట్. ఇక్కడ వైసిపికి సిట్టింగ్ అభ్యర్థి వాసుపల్లి గణేష్ ఉన్నారు. ఆయన్ని ఢీ కొట్టగలిగే నేతను, స్థానికంగా ఇక్కడ ఉండే వారిని ఎంపిక చేయడంలో రెండు పార్టీల అధిష్టానాలూ చతికిలపడ్డాయన్నది వినిపిస్తోంది. పొత్తులో ఈ సీటు జనసేనకు దక్కింది. అయితే ఇక్కడ ఏ మాత్రమూ ఓటింగ్ లేని వంశీకృష్ణకు ఇవ్వడంపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. స్థానికతను విస్మరించారంటూ జనసేనకు చెందిన మూగి శ్రీనివాసరావు బాహాటంగానే ఎద్దేవా చేస్తుండడం తెలిసిందే. అభ్యర్థిని మార్చాలంటూ పట్టుబడుతున్నారు. ఇక్కడ వాసుపల్లికి ధీటుగా ఎదిగిన వ్యక్తులను దృష్టిలో పెట్టుకోవాలని టిడిపి, జనసేన పార్టీలకు ఇప్పటికే లేఖలు వెళ్లాయి. కొంతమంది టిడిపి కార్పొరేటర్లు సైతం వంశీ అభ్యర్థిత్వం పట్ల తీవ్ర అభ్యంతరంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో కూటమి అధిష్టానాలు ఈ అంశంపై పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది.

భీమిలి అసెంబ్లీ సెగ్మెంట్ విషయంలోనూ టిడిపి, జనసేన తేల్చుకోలేని స్థితి కొనసాగుతోంది. గడచిన కొన్ని నెలలుగా ఇక్కడ వైసిపి సిట్టింగ్ ఎంఎల్ఎ, మాజీ మంత్రి ముత్తంశెట్టి తనదైన శైలిలో ప్రచారం సాగిస్తూ ముందుకు సాగుతున్నారు. ఆయన్ని ఢీకొట్టాలంటే మిగతా 2లో..



కంట్రోల్ రూమ్‌లో పనిని పర్యవేక్షిస్తున్న నోడల్ అధికారి ప్రసాద్

ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం

- కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్
- ఫిర్యాదుల స్వీకరణకు 1950 నెంబర్ కేటాయింపు
- పర్యవేక్షణకు ఎనిమిది బృందాలు నియామకం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు వేగవంతం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి ఎన్నికల నిర్వహణ ప్రణాళిక ప్రకారం టీమ్స్ ఏర్పాటు చేశారు. వాటి పనిని ఎప్పటిపప్పుడు సమీక్షిస్తున్నారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుచేసి ఆయా కమిటీల పనిని పర్యవేక్షించి సూచనలు ఇస్తున్నారు. ఎనిమిది కమిటీలను, ప్రతి కమిటీకి ఒక నోడల్ అధికారిని నియమించి ఎన్నికల నియమావళిని అమలు చేసేలా బాధ్యతలు అప్పగించారు. 24 గంటలు కమాండ్ కంట్రోల్ సెంటర్ పనిచేస్తోంది. ఎన్నికల సంబంధిత ఫిర్యాదులు, నిబంధనలు ఉల్లంఘన వంటివి చోటుచేసుకుంటే, ఆ సమాచారం తెలియజేసేందుకు 1950 నెంబరు ఏర్పాటుచేశారు. నేషనల్ గ్రీవెన్స్ సర్వేసెస్ పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను మిగతా 2లో..

పదోతరగతి పరీక్షకు 28,446 మంది హాజరు

వార్త 3లో..

ప్రశాంతి అపార్ట్‌మెంట్‌లో మంటలు

వార్త 3లో..

సీతంరాజు సుధాకర్ దారెటు ?

వార్త 2లో..



విన్యాసాల్లో భాగస్వాములైన ఇరుదేశాల నావికులు

టైగర్ ట్రయంఫ్ ప్రారంభం

తూర్పు తీరంలో భారత్ - అమెరికా విన్యాసాలు వార్త మెయిన్‌లో..

రెండో రోజుకు ఉబర్ డ్రైవర్ల సమ్మె

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమస్యలపై ఉబర్ డ్రైవర్లు చేపట్టిన సమ్మె మంగళవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఎయిర్‌పోర్ట్, జగదాంబ, పెందుర్తి, గాజువాక ప్రాంతాల్లో డ్రైవర్లు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు బి.జగన్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన రేట్లు తగ్గించకూడదని, చట్ట ప్రకారం కంటే అదనంగా కమీషన్ తీసుకోవడం అపాలని డిమాండ్ చేశారు. ఉబర్‌లో ఫ్లాట్ ఫామ్ ఫీస్ 39 తీసివేయాలన్నారు. తగ్గించిన రేట్లు పెంచాలన్నారు. నెగిటివ్ బ్యాలెన్స్ రూ.వెయ్యికి మించి ఉండాలన్నారు. నైట్ ఫెయిర్స్‌కి సంబంధించి రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు 50 శాతం ఇవ్వాలన్నారు. సమ్మెకు విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసులు, కె.పోలినాయుడు, ఆనంద్, అబ్బాయి, మనోహర్ రామ్మోహనం, సిమ్మ శ్రీను, నాయుడు నాయకత్వం వహించారు.



మల్కాపురం జోన్‌లో మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ధీరవనిత..మల్లు స్వరాజ్యం

వర్ధంతి సభల్లో వక్తలు వార్త 5లో..

మొదటి పేజీ తరువాయి..

అసంతృప్తుల కూటమి

కూటమికి సరైన అభ్యర్థి అవసరం. అనివార్య స్థితిలో విశాఖ ఎంపీ సీటును భరత్‌కు కాకుండా బిజెపికి ఇవ్వాల్సి వస్తే భీమిలికి భరత్‌ను పంపాలని లేదా తప్పనిసరైతే మాజీ మంత్రి గంటాను ఇక్కడి నుంచి అసెంబ్లీ బరిలోకి దించాలన్న ఆలోచనలో టిడిపి ఉన్నట్టు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. మరో రెండు రోజుల్లో అభ్యర్థులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం

స్వీకరించి, పరిష్కరించడం, చర్యలు తీసుకొనేలా సంబంధిత టీమ్స్ పని చేయనున్నాయి. సువిధ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తున్నారు.

వాలంటీర్లపై చర్యలు

వైసిపికి అనుకాలంగా ప్రచారం చేసిన గొలుగొండ మండలంలోని ఇద్దరు వాలంటీర్లను విధుల నుంచి తప్పించారు. ఎన్నికల పనిలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్‌కు కేటాయించిన 24 వాహనాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జిపిఎస్‌తో పర్యవేక్షిస్తున్నారు. డబ్బులు, మద్యం పంపిణీ నియంత్రణకు నియమించిన ఈ టీమ్స్ క్షేత్రస్థాయిలో ఎలా పనిచేస్తున్నాయనేది పరిశీలిస్తున్నారు. నిర్ధేశిత ప్రాంత పరిధిలో వాహనాలు తిరుగుతున్నాయా? పరిధి దాటి వెళ్తున్నాయా! అనేది జిపిఎస్ తో పరిశీలిస్తున్నారు. ప్రతి రోజు నియమిత టీమ్స్ ఎలక్షన్ కమిషన్‌కు నివేదికలు అందజేస్తున్నాయి.

ఇవీ టీమ్స్

ఎంసిసి, మీడియా మోనటరింగ్ కంట్రోల్ రూమ్, కంప్లయింట్ మోనటరింగ్ సెల్, ఎక్స్‌పెండెచర్ మోనటరింగ్ సెల్, కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్, సోషల్ మీడియా సెల్, కాల్ సెంటర్, వెబ్ కాస్టింగ్

ఎంవివిని కలిసిన పలువురు నేతలు



ఎంవివితో పలువురు నేతలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సోమవారం వైసిపిలో చేరిన టిడిపి సీనియర్ నేత గంపల వెంకట రామచంద్రరావు, ఆయన సతీమణి సంధ్యారాణి, గతంలో ప్రజారాజ్యం పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన డాక్టర్ కంచర్ల అచ్యుతరావులు మంగళవారం లాసన్స్‌బే కాలనీలోని విశాఖ ఎంపీ, వైసిపి తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవివి సత్య నారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంవివి.సత్యనారాయణ మాట్లాడుతూ జగన్ సంక్షేమం, అభివృద్ధిని చూసి పార్టీలో పలువురు చేరుతున్నట్టు తెలిపారు. కార్యక్రములో గోపాలపురం పరిశీలకులు గన్నమనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాలమరశెట్టి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరానికి చెందిన పాలమరశెట్టి శ్రీనివాసరావు టిడిపి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెనాయుడు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకూ ఈ పదవిలో ఉన్న పాశర్ల ప్రసాద్ పశ్చిమ నియోజకవర్గంలో గణబాబుకు పార్టీ టికెట్ ఇవ్వకూడదని పోరాటం చేశారు. అయితే పార్టీ టికెట్టు గణబాబుకే దక్కింది. ఈ నేపథ్యంలో టిడిపి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి పాశర్ల ప్రసాద్ రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే.



నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు

యుజిడి సమస్యపై నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని కృష్ణా గార్డెన్స్ రామాలయం వెనుక వీధిలో కొంతకాలంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లీక్ అవుతూ దుర్గంధపూరిత వాతావరణం నెలకొందని, తక్షణం ఆ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆ ప్రాంతంలో డివైఎఫ్ఐ జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ సమస్యను అధికారులుగానీ, వార్డు కార్పొరేటర్‌గానీ పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జగదాంబ జోన్ అధ్యక్షులు కె.గణేష్, ఉపాధ్యక్షులు కె.గౌతం, వి.అమ్మాజీ, అరుణ, అచ్చిబాబు, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

వంశీకి టికెట్ ఇవ్వొద్దంటూ..

దక్షిణంలో జనసేన కార్యకర్తల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం టికెట్‌ను జనసేనకు కేటాయించినప్పటికీ, పార్టీ తరపున పోటీ చేయనున్న మాజీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ విజయానికి తాము పనిచేసేది లేదని పలువురు జనసేన కార్యకర్తలు, మహిళలు రోడ్డెక్కారు. మంగళవారం పూర్ణా మార్కెట్ స్ప్రింగ్ రోడ్డు వాటర్ ట్యాంక్ వద్ద 'వంశీకృష్ణ వద్దు-జనసేన ముద్దు'అంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఎన్నికల కోసం రూపొందించిన వంశీకృష్ణ శ్రీనివాస్ ఫొటోతో ఉన్న పోస్టర్లు, ఫొటోలను దగ్ధం చేశారు. నల్ల బెలూన్లు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు సూరాడ తాతారావు, బంగారు రాజు మాట్లాడుతూ వంశీకృష్ణ శ్రీనివాస్ దక్షిణ నియోజకవర్గంలో సంబంధం లేని వ్యక్తిని, ఆయన తూర్పు నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి 50 వేలకుపైగా తేడాతో ఓటమి చెందారని, సొంత నియోజకవర్గంలో విజయం సాధించని వంశీకృష్ణ దక్షిణంలో ఎలా విజయం సాధిస్తారని ప్రశ్నించారు. ఆయనకు టికెట్ ఇస్తే జనసేన ఇక్కడ గెలవదని స్పష్టం చేశారు. స్థానిక జనసేన నాయకులు కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్, మూగి శ్రీనివాసరావులలో ఒకరికి టికెట్ ఇవ్వాలి లేదా దక్షిణలో పనిచేస్తున్న జనసేన నాయకులకు టికెట్ ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగన్నాథరావు, తాతాజీ, ఎమ్‌డి అబీదా పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



ఖాతాదారుల సమావేశంలో పాల్గొన్న రాంబాబు తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఖాతాదారుల మనోభావాలకు అనుగుణంగా, వినూత్నమైన సేవలందించేందుకే కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు స్థాపించబడిందని చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. ఖాతాదారుల ఆదరణతో రానున్న కాలంలో బ్యాంకును మరింత అభివృద్ధి దిశగా తీసుకువెళ్తామన్నారు. అన్ని రంగాల ఖాతాదారులకు తమదైన సరళిలో, సాంకేతికంగా సేవలం దించడమే తమ బ్యాంకు ముఖ్య లక్ష్యమన్నారు. బ్యాంకు రజతోత్సవాల సందర్భంగా గాజువాక శాఖలో మంగళవారం నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో రాంబాబు మాట్లాడారు. బ్యాంకు స్థాపించి 24 ఏళ్ల పూర్తి చేసుకుని 25వ ఏట అడుగిడిన తరుణంలో ఇప్పటికి వివిధ జిల్లాలో 28 శాఖలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. 1707 మంది సభ్యులతో రూ.38.38 లక్షల షేర్ ధనంతో కేవలం ఏడుగురు సిబ్బందితో ప్రారంభమైన బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం 17,350 మంది సభ్యులతో రూ.33 కోట్లు వాటా ధనం పొంది, రూ.1400 కోట్ల వ్యాపారంతో అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకింగ్ రంగంలోనే ముందంజలో ఉందన్నారు. బ్యాంకు డైరెక్టర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ గాజువాకలో తమ బ్యాంకు ఏర్పాటైన నాటి నుంచి ఖాతాదారులు, శ్రేయోభిలాషుల సహకారంతో ముందుకు సాగుతోందన్నారు. రూ.30 కోట్ల డిపాజిట్లు, రూ.13 కోట్ల రుణాలతో ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే కాకుండా వారి ఆదరాభిమానాలు పొందుతోందన్నారు. అనంతరం పలువురు ఖాతాదారులు మాట్లాడుతూ పలు సూచనలు చేయడంతో పాటు వారి సందేహాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ఖాతాదారులను బ్యాంకు చైర్మన్ శాలువాతో సత్కరించారు. మెమొంటోలను అందజేశారు. సమావేశంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్ కిషోర్, ఒఎస్‌ఒ శాస్త్రి, గాజువాక శాఖ మేనేజరు కె.సింహాచలం పాల్గొన్నారు.

1083వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా టిడిపి, జనసేన కూటమి బాధ్యత తీసుకోవాలని టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు నక్క లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన రిలేదీక్షలు మంగళవారం నాటికి 1083వ రోజుకు చేరాయి. దీక్షల్లో టిఎన్‌టియుసి నాయకులు కూర్చున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పిలి రామకృష్ణ. జిల్లా ఉపాధ్యక్షులు ముప్పాళ్ళ శ్రీకృష్ణ పాల్గొన్నారు.

ఉపకారవేతనాలు మంజూరు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యుకె విద్యావకాశాలు, సాంస్కృతిక సంబంధాల కోసం అంతర్జాతీయ బ్రిటిష్ కౌన్సిల్ యుకె విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో స్టెమ్ ప్రోగ్రాంలోని మహిళల కోసం బ్రిటిష్ కౌన్సిల్ స్కాలర్‌షిప్‌లను ప్రారంభించినట్లు బ్రిటిష్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ ఇండియా డైరెక్టర్ రిత్తికా చందా పరుక్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ భారతదేశం, దక్షిణాసియా దేశాల నుండి మహిళా స్టెమ్ స్కాలర్‌షిప్‌ల కోసం 25 స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయనున్నామన్నారు.

సీతంరాజు సుధాకర్ దారెటు ?

దక్షిణంలో ఆసక్తిగా రాజకీయ పరిణామాలు



సుధాకర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి 2024 ఎన్నికల్లో తప్పనిసరిగా పోటీ చేయాలని భావించిన రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ పరిస్థితి అయోమయంలో పడింది. వైసిపిలో ముఖ్య నేతగా కొనసాగిన ఆయన ఆ పార్టీ తరపున దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని గట్టిగా భావించారు. అయితే, టిడిపి తరపున ఈ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో నెగ్గిన వాసుపల్లి గణేష్ కుమార్ ఆ పార్టీకి దూరమై వైసిపికి దగ్గర కావడంతో సీతంరాజు సుధాకర్‌కు ప్రారంభంలోనే ఎదురు దెబ్బ తగిలింది. వైసిపిలో గణేష్ కుమార్ ప్రాధాన్యత పెరిగింది. అయితే, మొదటి నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న సీతంరాజు సుధాకర్ సేవలను వినియోగించుకోవాలని వైసిపి అధిష్టానం భావించి రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పదవిని కట్టబెట్టింది. అయినప్పటికీ దాంతో సుధాకర్ సంతృప్తి చెందలేదు. ఈ నేపథ్యంలో ఆయనకు కొద్ది మాసాలు క్రితం జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా టిక్కెట్ ఇచ్చి పోటీకి నిలిపింది. అందులో ఆయన ఓటమి చెందారు. మరోసారి ఆయనకు ఇలా గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావిస్తున్న తనకు ప్రధాన అవరోధంగా ఎమ్మెల్యే గణేష్ కుమార్ ఉన్నారని సుధాకర్ నిర్ణయించుకొని దక్షిణ నియోజకవర్గంలో గణేష్ కుమార్‌కు వ్యతిరేకంగా వైసిపిలో గ్రూపును తయారు చేశారు. గణేష్ కుమార్‌ను వ్యతిరేకిస్తున్న కొంతమంది వైసిపి కార్పొరేటర్లు ఆయనకు దూరమై సుధాకర్‌కు చేరువయ్యారు. వైసిపికి నియోజవర్గంలో పది మంది కార్పొరేటర్లు ఉండగా ఇద్దరు మినహా అందరూ సుధాకర్‌తో సఖ్యత కొనసాగించారు. పార్టీ అధిష్టానం దీనిని గుర్తించి కార్పొరేటర్లను బుజ్జగించింది. దీనిని గమనించిన సుధాకర్ వైసిపికి రాజీనామా చేశారు. అదే సందర్భంలో నలుగురు కార్పొరేటర్లు వైసిపికి గుడ్ బై చెప్పారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పదవీకాలం కూడా ముగిసింది. ఈ నేపథ్యంలో సుధాకర్ టిడిపిలో చేరి ఆ పార్టీ తరుపున దక్షిణం నుంచి పోటీ చేయాలని ప్రయత్నించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ఉమ్మడి విశాఖ జిల్లాలో కొద్ది నెలల క్రితం పర్యటించిన సందర్భంలో మాడుగులలో బసచేసిన ఆయనను సీతంరాజు సుధాకర్ ప్రత్యేకంగా కలిసి, దక్షిణం నుంచి టిడిపి తరుపున పోటీ చేసే అవకాశం ఇస్తే తమ గ్రూపు అంతా కలిసి టిడిపిలో చేరుతామని మంతనాలు జరిపారు. అయితే లోకేష్ నుంచి హామీ లభించలేదు. నియోజవర్గంలో మీరు పని చేస్తూ ఉండండి సమయం వచ్చినప్పుడు పార్టీ అవకాశం ఇస్తుందని మాత్రం చెప్పారు. దీంతో దింపుడు కళ్ళం ఆశతో అసెంబ్లీ టిక్కెట్లు కేటాయింపు సమయంలో దక్షిణం నుంచి పోటీ చేసే అవకాశం టిడిపి నుంచి తనకు దక్కవచ్చని సుధాకర్ భావించారు. అయితే అనుకోని విధంగా దక్షిణ టిక్కెట్ పొత్తులో భాగంగా టిడిపి కాకుండా జనసేనకు వెళ్ళింది. జనసేన తరుపున దక్షిణ అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్ పేరు ఖరారైంది. దీంతో సుధాకర్ ఆశలన్నీ అడియాసలు అయ్యాయి. అయినప్పటికీ ఆయనలో దక్షిణ ఎమ్మెల్యే గణేష్ కుమార్‌ను ఎలాగైనా ఓడించాలి అనే కసి పోలేదు. ఇప్పుడు అదే ఆలోచనతో, తన అనుచరులతో సుధాకర్ ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తూ గణేష్ కుమార్‌ను ఎలాగైనా ఓడించాలి, అవసరమైతే జనసేన పార్టీకి మద్దతుగా నిలుద్దాం అనే సంకేతాలు ఇస్తున్నారు. అయితే జనసేనకు పనిచేయడానికి సుధాకర్ అనుచరులు అందరూ సుముఖంగా లేరు. అదే జనసేన తరుపున సుధాకర్‌కు టికెట్ ఇస్తే బాగుండేది అని వారు భావిస్తున్నారు. ఈ పూర్వ రంగంలో సుధాకర్ నిర్ణయం ఎలా ఉంటుంది అనేది చర్చనీయాంశంగా మారింది.

బయోమెడికల్ రీసెర్చిపై గీతంలో అవగాహన

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన మల్టీడిసిప్లినరీ యూనిట్ ఆఫ్ రీసెర్చి ఆన్ ట్రాన్స్‌లేషనల్ ఇనిషియేటివ్స్ (మూర్తి) పరిశోధన కేంద్రం ఆధ్వర్యాన మాస్ స్పెక్ట్రోమెట్రి సదుపాయాన్ని ఉపయోగించుకుని బయోమెడికల్ పరిశోధనలలో ఏ విధంగా ప్రాజెక్టులను నిర్వహించవచ్చో తెలియజేస్తు అధ్యాపకులకు నాలుగు రోజుల అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం ప్రారంభించారు. గీతం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో ఏర్పాటుచేసిన మూర్తి ప్రయోగ శాలల ద్వారా ప్రపంచ స్థాయి పరిశోధనలను నిర్వహించాలన్నది తమ లక్ష్యం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ డిఎస్.రావు మాస్ స్పెక్ట్రోమెట్రి ఉపయోగించి చేయతగ్గ పరిశోధనలను వివరించారు. ప్రోటియోమిక్స్, మెటబోలోమిక్స్ వంటి విశ్లేషనలకు మాస్ స్పెక్ట్రోమెట్రి ఎలా వినియోగించాలో తెలియజేశారు. ప్రోటీన్ కెమిస్ట్రీకి పెరుగుతున్న ప్రాధాన్యతను వివరించారు. గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరక్టర్ ప్రొఫెసర్ జీవిఆర్.శర్మ మాట్లాడుతూ, బోధన, పరిశోధనలలో అధ్యాపకులకు మెరుగైన పనితీరు ప్రదర్శించడానికి ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ పరిశోధన సంస్థల నుంచి శాస్త్రవేత్తలు హాజరయ్యారు. కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ రాజ్‌దీప్‌దాస్ వింటర్ స్కూల్ పేరిట నిర్వహిస్తున్న ఈ శిక్షణ ద్వారా పరిశోధకులకు మాస్ స్పెక్ట్రో మెట్రి ద్వారా లభించే సాంకేతిక సమాచారాన్ని విశ్లేషించటం, తద్వారా వివిధ పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించడం ఎలాగో తెలియ జేస్తామన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ, బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం (బార్క్) విశ్రాంత శాస్త్రవేత్త, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశిష్ట ప్రొఫెసర్ బివిఆర్.టాటా, ప్రోగ్రామ్ డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

గీతం ఐఇఇఇ విద్యార్థి విభాగం సమావేశం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఇసిఇ విభాగం విద్యార్థులు సభ్యులుగా గల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ (ఐఇఇఇ) విద్యార్థి విభాగం మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్ఎస్‌టిఎల్ శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్.అనిల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై రక్షణ రంగంలో యాంటెన్నా ప్రయోజనాలపై ప్రసంగించారు. రక్షణ రంగంలో ఉపయోగించే క్షిపణుల డిజైనింగ్‌లో యాంటెన్నాలకు గల ప్రాధాన్యతను వివరించారు. ఆల్టీమీటర్ యాంటెన్నాలతో పాటు రేడియో ఫ్యూజ్, సీకర్, టెలికమాండ్ యాంటెన్నాల గురించి తెలియజేశారు. గీతం విద్యార్థులు రక్షణ రంగ పరిశోధనలపై ఎన్ఎస్‌టిఎల్‌లో గల మ్యూజియంను సందర్శించాలని సూచించారు. కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఇసిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.భరణి చంద్రకుమార్, ప్రొఫెసర్ జెబి.సెవెన్‌లైన్, డాక్టర్ కెఎమ్.చిప్పి, డాక్టర్ బి.సూరిబాబు నాయక్, డాక్టర్ యు.రత్నకుమార్, డాక్టర్ కె.రేణు, డాక్టర్ అరవింద్ ప్రసంగించారు.

గీతం దూర విద్య డిగ్రీ, పీజీ కోర్సుల అడ్మిషన్లు

ప్రజాశక్తి-మధురవాడ : దూర ప్రాంతాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తూ ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి, ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ చదువు కొనసాగించాలనుకునేవారికి నామ మాత్రపు రుసుముతో డిగ్రీ, పీజీ కోర్సులు చదువుకునే అవకాశాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ లెర్నింగ్ (సిడిఎల్) ద్వారా అందుబాటులోకి తెస్తున్నట్లు సిడిఎల్ డైరక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. మొదటి దశలో బిఎ, బికామ్ డిగ్రీ కోర్సులతో పాటు ఎమ్ఎ ఇంగ్లీషులో ఈ ఏడాది ప్రవేశాలను కల్పిస్తున్నామని వెల్లడించారు. యుజిసి గుర్తింపుతో నిర్వహిస్తున్న ఈ కోర్సులలో ప్రవేశం పొందేవారికి ఆన్‌లైన్ ద్వారా స్టడీ మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పూర్తి వివరాలకు గీతం సిడిఎల్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 31వ తేదీలోగా అందజేయాలని పేర్కొన్నారు. మరింత సమాచారానికి రొండపర్తిలోని గీతం సిడిఎల్ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

కెకె.రాజుకు అభినందనలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా కెకె.రాజును ప్రకటించడంతో పలు స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు, స్థానికులు, నాయకుల నుంచి ఆయనకు అభినందనలు వెలువెత్తుతున్నాయి. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కెకె రాజుకు పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలియజేస్తున్నారు.

మహిళా సాధికారత హామీకే పరిమితం

ప్రజాశక్తి - ఆరిలోవ : మహిళా సాధికారత హామీలకే తప్ప అమల్లో లేదని సెయింట్ ఆన్స్ హోం సుపీరియర్ అన్నీ మారియా అన్నారు. విశాఖ మ్యూచ్‌వలి ఎయిడెడ్ కో-ఆపరేటిల్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యాన ఆరిలోవ కాలనీ, సెయింట్ ఆన్స్ కాన్వెంట్ ఆవరణలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అతిథులు అన్నీ మారియా, ఫిలోమినా జోసెఫ్, నిర్మలా మేరీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా నేటికీ వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా మహిళలు ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విఎంఎంసిఎ అధ్యక్షులు జి.ఇందిర తదితరులు పాల్గొన్నారు.



సెయింట్ ఆన్స్ మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళలు

సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరానికి ఆదరణ

రోగులకు వైద్యం అందిస్తున్న వైద్యులు



రోగులకు వైద్యం అందిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరానికి ఆదరణ బాగుందని మాజీ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ అన్నారు. విశాలాక్షినగర్, బివికె కళాశాలలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యాన మంగళవారం సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గురూజీ జై శ్రీరామ్, ఆక్యుపెషర్ నిపుణుల పర్యవేక్షణలో నిర్వహించిన వైద్య శిబిరానికి రోగులు అధిక సంఖ్యలో పాల్గొని చికిత్స తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాధవ్, సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ మాట్లాడుతూ, బుధవారం సాయంత్రం వరకు నిర్వహించే ఈ శిబిరంలో వెన్ను నొప్పి, మోకాళ్ల నొప్పి, కాళ్ల పీకులు స్పాండిలైట్స్‌తో బాధపడుతున్న వారంతా వచ్చి చికిత్స పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త ఆశోక్ కుమార్, ప్రకృతి రైతు షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షకు 28,446 మంది హాజరు

ప్రజాశక్తి - ఆరిలోవ : జిల్లాలో పదో తరగతి పరీక్ష రెండో రోజు ప్రశాంతంగా జరిగింది. ద్వితీయ భాష పరీక్షకు 28,446 మంది విద్యార్థులకు గాను 28,223 మంది హాజరయ్యారని, 223 మంది గైర్హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలూ చోటు చేసుకోలేదన్నారు. జిల్లా అబ్జర్వర్ బి.విజయ్ భాస్కర్ ఐదు కేంద్రాలను, డిఇఒ 6 కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 73 కేంద్రాలను సందర్శించారు.

కూలిన శ్లాబు

ఆదుకోవాలంటూ తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం, పాలవలసలో గెద్ద లక్ష్మికి చెందిన పురాతన ఇంటి శ్లాబు మంగళవారం విరిగిపడిపోయింది. పేదరికంలో ఉన్న లక్ష్మికి గూడు కోల్పోవడంతో ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని కోరుతూ మంగళవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. 40 ఏళ్లుగా వారసత్వంగా వచ్చిన ఇంటిలో తాను, తన కుమార్తె ఉంటున్నామని తెలిపారు. తన భర్త మృతిచెందారని, కుమార్తె ప్రస్తుతం డిగ్రీ చదువుతోందని, కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని వివరించారు. అధికారులు స్పందించి ఇంటి నిర్మాణానికి స్కీమ్‌కానీ, ఇంటి స్థలం కానీ ఇప్పించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు.



శ్లాబు కూలిన ఇంటి వద్ద బాధితులు

నేరాలు ఘోరాలు

భవన నిర్మాణ కార్మికుడు దుర్మరణం

ప్రజాశక్తి -కోటవురట్ల: నాలుగు అంతస్తుల భవనం నిర్మాణ పనుల్లో పాల్గొన్న కార్మికుడు ప్రమాదవశాత్తు పైఅంతస్తు నుంచి కిందకు పడటంతో దుర్మరణం పాలైన ఘటన మంగళవారం కోటవురట్లలో చోటుచేసుకుంది. వివరాలివి. మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన ఇసరపు రామకృష్ణ (25) కోటవురట్ల గ్రామంలో కృపాలయ చర్చి సమీపంలో నాలుగు అంతస్తుల భవన నిర్మాణ పనికి వెళ్లాడు. పైఅంతస్తులో పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందకు జారిపడడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రామకృష్ణకు ఇటీవల మూడు నెలల క్రితం వివాహం జరిగిన భార్య లక్ష్మీ శిరీష ఉన్నారు, రామకృష్ణ మతితో కుటుంబ సభ్యులు విషాదఛాయలు అలముకున్నాయి. భర్త మృతితో నవవధువు కన్నీటి రోదన చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థి మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రేమ విఫలం కావడంతో ఈ నెల 14వ తేదీన భీమిలిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ విద్యార్థి సోమవారం మృతిచెందాడు. ఎస్ఐ జి.పైడిరాజు కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట మండలం, కొత్తవలస గ్రామానికి చెందిన మామిడి కేశవ్ (19) తల్లిదండ్రులతో కలిసి స్థానిక బిక్కలమెట్టలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం స్థానిక బ్యాంక్ కాలనీ వద్ద నోటి వెంబడి నురగలు కక్కుతూ పడి ఉన్నాడు. అతని స్నేహితుడు గమనించి కేశవ్ తల్లిదండ్రులకు సమాచారం అందిచ్చాడు. వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సలహా మేరకు విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడు ఓ యువతిని ప్రేమించాడని, ఆమె అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. మృతుని తల్లి జయ ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.పైడిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు గడ్డి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ పరిధి సుజాతనగర్ 80 అడుగుల రోడ్డు చివర రెండు గడ్డి కుప్పలు మంగళవారం దగ్ధమయ్యాయి. ఆకతాయిలు ఎవరో సిగరెట్ కాల్చడానికి వెళ్లి మిగిలిన ముక్కను పడేయడంతో మంటలు వ్యాపించి ఉంటాయని స్థానికులు అనుమానిస్తున్నారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి చెందినట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... జివిఎంసి ఆరో వార్డు పరిధి కొమ్మాది శ్యాంనగర్‌కు చెందిన ఎస్.రమేష్ (27) టిఫ్-3లో నివాసం ఉంటున్నాడు. మద్యం మత్తులో ఉన్న ఆయన మంగళవారం భవనం పైనుండి కిందకు పడిపోయాడు. స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చి పరిశీలించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడు తల్లి కనక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

ప్రశాంతి అపార్ట్‌మెంట్‌లో మంటలు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి సుజాతనగర్ గొల్లవిల్లిపాలెం ప్రశాంతి అపార్ట్‌మెంట్‌లో మంగళవారం రాత్రి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికుల కథనం ప్రకారం... ప్రశాంతి అపార్ట్‌మెంట్‌లో ఐదు అంతస్తులో ఉన్న ఇంటి యజమాని వాషింగ్ మిషన్‌ను ఆన్ చేసి మరిచిపోయి బయటకు వెళ్లిపోయాడు. దీంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి అపార్ట్‌మెంట్ అంతా మంటలు వ్యాపించాయి. అపార్ట్‌మెంట్ వాసులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు.

కురిసిన వర్షం

ప్రజాశక్తి -తగరపువలస : తగరపువలసలో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. గత రెండ్రోజులుగా ఒక మోస్తరుగా ఎండలు మండాయి. ప్రస్తుతం కురిసిన వర్షంతో జనం ఒకింత ఉపశమనం పొందారు.

సమస్యలపై ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది వినతి

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాటుచేసిన గ్రీవెన్స్‌లో నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో వివిధ కేడర్లలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, పారామెడికల్, ఆప్తాలమిక్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నిషియన్స్, ఫార్మసిస్టలను రెగ్యులర్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల వలె సమాన పనికి సమాన వేతనం అంటే మినిమం టైం స్కేల్ అమలు చేయాలని వినతిలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగుల జీతాల్లో కనీసం నాలుగో వంతు కూడా నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావును నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆర్.సురేష్ కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రెసిడెంట్ శశిభూషణ్, సెక్రటరీ వీరబ్రహ్మం, ట్రెజరర్ గోపీనాథ్, రత్నం, అనిత, సూర్యకుమారి, భవాని తదితరులు పాల్గొన్నారు.


డిఎం అండ్ హెచ్ఒకు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది


ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన విద్యార్థులతో ప్రతినిధులు

విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-పెందుర్తి : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న ఇంజినీరింగ్ అండ్ పాలిటెక్నిక్ విద్యార్థులకు మంగళవారం తమిళనాడులోని చెంగలపట్టుకు చెందిన టివిఎస్ సుందరం లిమిటెడ్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. క్యాంపస్ డ్రైవ్‌లో 37 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థుల వార్షిక వేతనం రూ.రెండు లక్షల వరకు ఉంటుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీధర్‌పట్నాయక్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పి.ప్రసాద్, ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ ఆఫీసర్ డాక్టర్ అడారి తులసినాయుడు అభినందించారు.


ప్రదర్శనలో పుస్తకాలను పరిశీలిస్తున్న సంజీవరావు

పుస్తకం ఓ భాండాగారం

ప్రజాశక్తి-ఉక్కునగరం : పుస్తకం ఓ భాండాగారం అని, పుస్తకం ద్వారా అనేక విషయాలు తెలుసుకోవచ్చని స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) కె.సంజీవరావు అన్నారు. ఉక్కునగరంలోని సెక్టార్ -2 కాంప్లెక్స్ వద్ద మంగళవారం విశాలాంధ్ర సంచార పుస్తకాలయాన్ని సంజీవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలాంధ్ర సంచార పుస్తకాలయంలో ఎన్నో విజ్ఞానదాయక పుస్తకాలు ఉన్నాయని అన్నారు. ఉక్కు నగర వాసులు ఈ అవ కాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జాతీయ సమితి సభ్యులు జె.రామకృష్ణ, యూనియన్ నాయకులు జి.బోసుబాబు, కె.రాజబాబు, ఎ.మసేన్‌రావు, జి.ఆనంద్, వెంకటేష్, కొణతాల శ్రీనివాస్, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ.రాజు, హెచ్‌ఎంఎస్ అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమే...

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధిపై డిబేట్‌కు తాము సిద్ధంగా ఉన్నామని 97వ వార్డు వైసిపి అధ్యక్షుడు ఎం.మహేష్ చెప్పారు. అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సోమవారం జనసేన నాయకులు మీడియా సమావేశం ద్వారా ప్రశ్నించడంపై మహేష్ స్పందించారు. సుజాతనగర్ వైసిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. 97వ వార్డులో సుమారు రూ.13 కోట్ల పైబడి అభివృద్ధి పనులు ఎమ్మెల్యే చేశారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని పులగానిపాలెం రోడ్డు సమస్య, పాలిటెక్నిక్ కళాశాల ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశారని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం ఎక్కడా ఆగలేదన్నారు. 2024 ఎన్నికల్లో అదీప్‌రాజును 50 వేల మెజారిటీతో గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైకాపా నాయకులు పాల్గొన్నారు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

గాజువాక సర్వతోముఖాభివృద్ధికి కృషి

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధికి ఎమ్మెల్యే నాగిరెడ్డి కృషిచేశారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, గాజువాక వైసిపి అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. జివిఎంసి 64వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి ధర్మాల శ్రీను అధ్యక్షతన వెంకన్నపాలెం రామాలయం వద్ద మంగళవారం కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ, గాజువాక నియోజకవర్గం అభివృద్ధిలో గుడివాడ, తిప్పల కుటుంబాలు కీలక పాత్ర పోషించాయన్నారు. 1978లో గుడివాడ అప్పన్నకు, 1989లో గుడివాడ గురునాథరావుకు, 2019లో తిప్పల నాగిరెడ్డికి ఇక్కడ ప్రజలు పట్టం కట్టారని, 2024 ఎన్నికల్లో తనను గెలిపించాలని అమర్‌నాథ్ అభ్యర్థించారు. తనను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి నాగిరెడ్డి, గురుమూర్తి రెడ్డి, దేవన్‌రెడ్డితో కలిసి పనిచేస్తామని చెప్పారు.

ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ, అమర్‌నాథ్‌ను గెలిపించుకుంటే అభివృద్ధి పనులు వేగవంతమవుతాయన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా నియమితులైన తిప్పల నాగిరెడ్డిని మంత్రి అమర్‌నాథ్ సత్కరించారు. అనంతరం 67వ వార్డు ఇన్‌చార్జి పల్లా చినతల్లి, మహ్మద్ గౌస్, దొడ్డి రమణ, సన్యాసిరావు ఇళ్లకు అమర్‌నాథ్ వెళ్లి పార్టీ విజయానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైసిపి నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, ధర్మాల శ్రీను, గుడివాడ లతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో సెంటిమెంట్ ఏమవుతుందో?

ప్రజాశక్తి-పెందుర్తి : అతి పెద్ద నియోజకవర్గాల్లో ఒకటైన పెందుర్తిలో ఈ ఎన్నికల్లో సెంటిమెంట్ ఏమవుతుందోనని చర్చ జోరుగా సాగుతోంది. ఎస్ఆర్ఎస్ అప్పలనాయుడు, ద్రోణంరాజు సత్యనారాయణ, గుడివాడ గురునాథరావు తదితర ఎంతో మంది సీనియర్ నాయకులు ఇక్కడి నుంచి పోటీచేశారు. పెందుర్తి నియోజకవర్గం ఏర్పడిన నుంచి ఇక్కడ ఒక సెంటిమెంట్ నడుస్తోంది. ఒకసారి ఇక్కడ గెలుపొందిన అభ్యర్థి రెండోసారి గెలిచిన దాఖలాలు లేవు. 2009లో ప్రజారాజ్యం నుంచి పంచకర్ల రమేష్‌బాబు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో వైసిపి నుంచి అన్నంరెడ్డి అదీప్‌రాజు ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజకవర్గంలో కొత్త అభ్యర్థులకే ఎక్కువ అవకాశం ఉండేది. ఈసారి మాత్రం గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అభ్యర్థులే పోటీలో ఉన్నారు. దీంతో సెంటిమెంటు ఏమవుతుందోనని జోరుగా చర్చసాగుతోంది. కొత్తగా ఎవరైనా బలమైన స్వతంత్ర అభ్యర్థి పోటీలో ఉంటే సెంటిమెంట్ ఫలించి గెలిచినా ఆశ్చర్యపోనవసరం లేదని చర్చించుకుంటున్నారు.

వినియోగదారుల హక్కుల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కన్జ్యూమర్ ఫోరం ప్రతినిధులు

ప్రజాశక్తి-పెందుర్తి : అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల వారోత్సవాల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆసరా ఆధ్వర్యాన పోస్టర్‌ను కన్జ్యూమర్ డిస్టిక్ ఫోరం-1 ప్రెసిడెంట్ డాక్టర్ జి.తంజరెడ్డి , కన్జ్యూమర్ డిస్టిక్ ఫోరం-2 ప్రెసిడెంట్ జి.వెంకటేశ్వరి, మెంబర్స్ కృష్ణమూర్తి, డాక్టర్ కె.రమణబాబు, పి.విజయ దుర్గ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆసరా చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను కొనియాడారు. అనకాపల్లి జిల్లా ఆసరా ప్రెసిడెంట్ ఇ.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ ఎవేర్‌నెస్ పేరిట ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సాంకేతిక టెక్నాలజీలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక రకంగా మోసానికి గురవుతున్నారని చెప్పారు. దీనిపై అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆసరా సభ్యులు పాల్గొన్నారు.

10వ వార్డులో ఎంవివి పర్యటన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి రవీంద్రనగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో తూర్పు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ పర్యటించారు. ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలనడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రవీంద్రనగర్‌లో సూరాడ శ్రీనివాస్, కనకమహాలక్ష్మి నివాసంలో ఏర్పాటుచేసిన సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్, బొండా శ్రీనివాసరావు, స్థానిక మహిళలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రజలు విజ్ఞత చూపాలి

ప్రజాశక్తి-మాధవధార : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు విజ్ఞత చూపి ఓటు వేయాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఒబిసి డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు కోరారు. ఎన్‌డిఎ కూటమి ప్రజాగళం పేరుతో నిర్వహించిన సభలో ఎక్కడా ప్రజల ప్రస్తవన లేదని విమర్శించారు. అధికార దాహం తప్ప జనం సమస్యలు ఆ మూడు పార్టీలకు పట్టలేదన్నారు. ఎన్‌డిఎకు ఓటు వేస్తే అభివృద్ధికి పునాది పడుతుందని మోడీ అంటున్నారని, గడిచిన పదేళ్లలో పునాది వేయకుండా ఏమి చేశారని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలుచేయని బిజెపిని ఏమనాలని ప్రశ్నించారు. బిజెపి ఉత్తిత్తి మాటలకు టిడిపి, జనసేన మహానందం పొందుతున్నాయని ఎద్దేవాచేశారు. బిజెపిని పొగిడేందుకు ఈ రెండు పార్టీల నాయకులు పోటీ పడ్డారని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి లేకపోవడానికి వైసిపి కారణం అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటి సంతకం ప్రత్యేక హోదా పైనే ఉంటుందన్నారు.


పార్కులో ప్రచారం చేస్తున్న కెకె.రాజు

'ఉత్తరం'లో ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర నియోజకవర్గం పరిధి సీతమ్మధార స్నిపర్ పార్కు, హిల్ వ్యూ పార్కు, 24వార్డు టిపిటి కాలనీ బృందావనం పార్కును వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు, సాడి పద్మారెడ్డితో కలిసి మంగళవారం సందర్శించారు. పార్కుకు వచ్చిన వాకర్స్‌తో ముచ్చటించారు. రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరివర్మ, కోడూరిపాటి శ్రీను, ప్రవీణ్ వర్మ, సెక్యూరిటి శ్రీను, బాబు, బల్లా శ్రీను, అంబటి శైలేష్, ఎం.సునీల్, గుడ్ల అశోక్‌రెడ్డి, సమ్మెట్ల వెంకటేష్, కె.సత్యనారాయణ, బొట్టా రాజు, నవీన్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

యార్లగడ్డకు పురస్కారం పట్ల హర్షం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగం గౌరవ ఆచార్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు ఇంటలెక్చువల్ ఆఫ్ ది ఇయర్ 2024 పురస్కారం లభించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రిఫాసిమెంటో ఇంటర్నేషనల్ సంస్థ బోర్డ్ ఆఫ్ ఎడిటర్స్ ఈ పురస్కారాన్ని ఆచార్య లక్ష్మీప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో లక్ష్మీప్రసాద్‌ని అభినందించారు. ఏయూ ఆచార్యులు సాధించే పురస్కారాలు, అవార్డులు వర్సిటీకి ప్రతిష్టను అందిస్తాయన్నారు.

ధీరవనిత.. మల్లు స్వరాజ్యం

- ఆమె ఆశయాలను కొనసాగిస్తాం
- వర్ధంతి సభల్లో ఐద్వా నేతలు


తేగాడలో నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు, మహిళలు

ప్రజాశక్తి-అనకాపల్లి, కశింకోట

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ధీర వనిత అని పలువురు వక్తలు కొనియాడారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తామన్నారు. మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి కార్యక్రమాలు ఐద్వా ఆధ్వర్యాన అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రాంగణంలోనూ, కశింకోట మండలం తేగాడ గ్రామంలోనూ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం చిత్ర పటాల వద్ద పుష్పాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు ప్రాంతాల్లోనూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా నాయకులు డి.డి.వరలక్ష్మి మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం 1945-48 మధ్య కాలంలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించి నైజాం సర్కార్‌ను గడగడలాడించారని గుర్తు చేశారు. రజాకారుల పాలిటి సింహ స్వప్నమై వారికి ముచ్చెమటలు పట్టించారన్నారు. వరంగల్, కరీంనగర్, అదిలాబాద్ జిల్లాలోని గిరిజనుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు నల్గొండ జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నుండి సిపిఎం తరుపున రెండుసార్లు ఎన్నికైనట్లు చెప్పారు. ప్రజల విముక్తి కోసం సాగిన పోరాటంలో 13 ఏళ్ల వయసులోనే ఆయుధం చేపట్టారని, అజ్ఞాత జీవితం గడిపారని, తర్వాత ప్రజాక్షేత్రానికి వచ్చి ప్రజాప్రతినిధిగా ఎన్నికై ప్రజల తరుపున పోరాడారని తెలిపారు. కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగించడమే ఆమెకు ఇచ్చిన ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. అనకాపల్లి జరిగిన కార్యక్రమంలో నాగమణి, పార్వతి, రమాదేవి, లక్ష్మి, వెంకటలక్ష్మి, మంగ, భారతి, తేగాడలో శ్రీదేవి, ఎం.మాణిక్యం, పార్వతి, మలపురెడ్డి వరహాలమ్మ, దేవి, నయోమిని, పొట్నూరి సన్యాసమ్మ, మంగ, రమణమ్మ, కొండమ్మ, వెంకటలక్ష్మి, నాగమణి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి డెస్క్ : నర్సీపట్నం సిఐటియు కార్యాలయంలో వీరతెలంగాణ పోరాట యోధురాలు, ఐద్వా పూర్వ నాయకులు మల్లు స్వరాజ్యం రెండవ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరి మాట్లాడుతూ, చిన్నతనంలోనే కూలి రేట్లు కోసం పోరాడిన స్వరాజ్యం, నైజాంకు వ్యతిరేకంగా పోరాడారు. వృత్తిదారులు, మహిళలపై దాడులు, సారా వ్యతిరేక ఉద్యమంలో పనిచేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కోశాధికారి కెవి.సూర్యప్రభ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు కె ప్రసన్న, అంగన్వాడీ యూనియన్ నేత వి.సామ్రాజ్యం, పరివేణి, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాపిరెడ్డి నారాయణమూర్తి పాల్గొన్నారు.

మల్కాపురం : స్వరాజ్యం వర్ధంతి సభలు ఐద్వా ఆధ్వర్యంలో 58వ వార్డు గుల్లలపాలెం, 59వ వార్డు నెహ్రూ నగర్, 63వ వార్డు క్రాంతి నగర్‌లో జరిగాయి. గుల్లలపాలెంలో పి.పోలమ్మ, నెహ్రూ నగర్‌లో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఆర్.విమల 63వ వార్డులో పూడి దొడ్డమ్మ మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ స్వరాజ్యం మాటలు తుపాకీ తూటాలన్నారు. కళాకారిణిగా, ప్రజా ప్రతినిధిగా, మహిళా హక్కుల నేతగా స్వరాజ్యం అందించిన సేవలను గుర్తుచేశారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో మమత, అరుణ, కృష్ణవేణి, సింహచలం, రవణమ్మ, పార్వతమ్మ, ఎం.జయలక్ష్మి, గోవిందమ్మ, లక్ష్మి, రాధ, సిఐటియు నాయకులు రమణ, రాంబాబు, రాము, శివ, సూరిబాబు, రాజు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఐద్వా నేతలు


బందోబస్తు ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

టెన్త్ హిందీ పరీక్షకు 97 శాతం మంది హాజరు

ప్రజాశక్తి-అనకాపల్లి

పదవ తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన హిందీ పరీక్షకు 97 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఈ మేరకు ఆమె పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెగ్యులర్ విద్యార్థులు 21,204 మందికి 20,860 మంది హాజరయ్యారని, 344 మంది హాజరు కాలేదని తెలిపారు. ప్రైవేట్ విద్యార్థులు 252 మందికి 93 మంది హాజరుకాగా, 159 మంది గైర్హాజరు అయినట్లు చెప్పారు. మొత్తంగా 21,456 మంది హాజరు కావలసి ఉండగా 20,953 మంది హాజరైట్లు పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ మంగళవారం స్థానిక గవరపాలెం జడ్పీ హైస్కూల్, రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీచైతన్య స్కూల్‌లో పరీక్షా కేంద్రాలను సందర్శించి, బందోబస్తు ఏర్పాట్లును పర్యవేక్షించారు. ఆయన వెంట అనకాపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ శంకరరావు ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కశింకోట

కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుపతిరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వయస్సు, లింగం, పేద ధనిక వంటి బేధాలు లేకుండా క్షయ వ్యాధి కొన్ని లక్షల మందికి సోకు తుందని చెప్పారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లోనే క్షయ వ్యాధి అధికంగా ఉందన్నారు. ఒకరి నుండి ఒకరికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో టిబి నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పరమానందరావు, పీహెచ్ఎన్ సత్యవతి, వెంకటరమణ, పద్మజ, పారామెడికల్ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

నల్లమారమ్మను దర్శించుకున్న భరత్ కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని సీతానగరం గ్రామ దేవత శ్రీనలమారమ్మ అమ్మవారి పండుగ మహోత్సవం సందర్భంగా అనకాపల్లి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ మంగళవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ కొత్తపల్లి శ్రీనివాసరావు ఇంట్లో ఆత్మీయ పరిచయ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద, పలక రవి, దాడి నారాయణరావు, సూరిశెట్టి శ్రీను, పీలా బుజ్జి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భరత్ కుమార్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

జాతీయ స్థాయి బేస్‌బాల్ ఛాంపియన్ షిప్‌కు సంస్కృతి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- పరవాడ

ఆంధ్రప్రదేశ్ బేస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలో ఈ నెల 17న జరిగిన ఎంపిక పోటీల్లో పరవాడ సంస్కృతి గ్లోబల్ స్కూల్ 11వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎవి శశాంక్ వర్మ, కె.ధీరజ్ సాయిరామ్ మంచి ప్రతిభ కనబర్చారు. మార్చి 22 నుండి 26 వరకు పంజాబ్ రాష్ట్రంలోని సంగ్రూర్‌లో జరుగు జాతీయ స్థాయి బేస్ బాల్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికైనట్లు స్కూల్ స్పోర్ట్స్ డైరెక్టర్ జి. మధుబాబు తెలిపారు. ఈ క్రీడాకారులకు, కోచ్ రాజేష్‌కుమార్‌కు ప్రిన్సిపాల్ ఎస్. సీతాలక్ష్మి, సిఈఓ కె.నిశాంత్ అభినందనలు తెలిపారు.

వాకర్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

వాకర్స్ క్లబ్ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షులు ఎరుబండి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో వాకర్స్ క్లబ్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా పూర్వపు అధ్యక్షులుగా చేసిన క్రీస్తుశేషులు బుద్ధ రామప్పరావు మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షులుగా ఎరుబండి సత్యనారాయణ (ఆర్టీసీ), కార్యదర్శిగా మత్తుర్తి ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా మాజీ ఎపీపీ పిల్లా హర శ్రీనివాసరావు, కోన అప్పారావు వ్యవహరించారు.

స్నేహితుని వైద్యానికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : తమ సహచర పూర్వ విద్యార్థి శ్రీహరి వైద్యానికి రూ.10,59,904 ఆర్థిక సహాయాన్ని సాయానికి 10 రూపాయల సేవ సంస్థ (ఎఎంఎఎల్ కళాశాల పూర్వ విద్యార్థులు) ఆధ్వర్యాన మంగళవారం అందజేశారు. నర్సీపట్నం మున్సిపాలిటీ మూడవ వార్డుకు చెందిన మద్రా శ్రీహరి తొమ్మిది నెలల ముందు సెంట్రింగ్ పని చేస్తూ రెండు అంతస్తులు పైనుండి పడి వెన్నుపూస విరిగిపోయింది. అప్పు చేసి వైద్యం చేసినా మెరుగుపడకపోగా ఇంకొక ఆపరేషన్ చేయాలని, అందుకు గాను సుమారు రూ.6 లక్షల పైగా ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. వారి ఆర్థిక పరిస్థితి స్తోమత చాలక నెలలు నిండిన భార్య, ఇద్దరు చిన్నపిల్లలతో మంచానికే పరిమితమై నిస్సహాయ స్థితిలో ఉన్న శ్రీహరి సహాయం కోసం సాయానికి 10 రూపాయలు సేవా సంస్థను సంప్రదించారు. దీంతో సంస్థ సభ్యులు శ్రీహరి కష్టాన్ని ఒక వీడియో రూపంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అనేక మందికి వివరించారు. స్నేహితులు, బంధువులు ద్వారా వారంరోజుల పాటు విరాళాలు సేకరించి శ్రీహరి వైద్యానికి సుమారు రూ.10,59,904 సమకూర్చారు. ఈ మొత్తాన్ని ప్రముఖ హొమియోపతి వైద్య నిపుణులు డాక్టర్ శశిధర్, ఏఎంఏఎల్ కళాశాల బోటనీ అధ్యాపకులు డాక్టర్ ఎం.హరిబాబు, నర్సీపట్నం ఎంఈఓ జివి ఎస్ నాగేంద్ర, బొడ్డపల్లి బయాలజీ ఉపాధ్యాయులు వివి.ప్రభాకర్ చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. సంస్థ అధ్యక్షులు లాలం ఏసుబాబు, సభ్యులను పలువురు అభినందించారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

పౌష్టికాహారంపై అవగాహన పెంచాలి

ప్రజాశక్తి- కశింకోట

గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన పెంచాలని ఐసిడిఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి చిన్మయిదేవి అన్నారు. మండలంలోని జి.భీమవరం అంగన్వాడీ కేంద్రం వద్ద మంగళవారం పోషణ పక్వాడీపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలన్నారు. అనంతరం స్టాల్ పరిశీలించారు. కార్యక్రమంలో సిడిపిఓ ప్రభావతి, అసిస్టెంట్ సిడిపిఓ శశికళ, సూపర్ వైజర్ సుచరిత ఆదిలక్ష్మి, వంశీప్రియ, ఆరోగ్యాధికారి ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్త శ్రీదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోవాలి

మునగపాక : పోషక విలువలు గల చిరుధాన్యాలు, ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని టాటా ట్రస్ట్ కోఆర్డినేటర్ సిహెచ్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్‌హెచ్ పి.ఆశాజ్యోతి, పోషక సఖి జి అనురాధ సూచించారు. మండలంలోని నాగులపల్లి అంగన్వాడీ 3, 4 కేంద్రాలలో పోషకాహార పక్షోత్సవాలు మంగళవారం టాటా ట్రస్ట్, ఏసియన్ పెయింట్స్ వారి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్స్ ఎస్ పద్మ, సరస్వతి, ఆశా వర్కర్స్ ఎం శ్రావణి, పోషక సఖీలు సిహెచ్ లీలావాణి, జయలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికల టీమ్‌లు సమన్వయంతో పని చేయాలి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ టీమ్‌లు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వెలెన్స్, వీడియో వీవింగ్, స్టాటిక్ సర్వెలెన్స్, మీడియా మోనిటరింగ్ టీమ్‌లు వారికి సంబంధించిన విషయాలను క్షుణ్ణంగా గమనించి, పరిశీలించి, తనిఖీ చేయాలని సూచించారు. పార్టీ లేదా అభ్యర్థుల ఖర్చు, ర్యాలీలు, సమావేశాలు, ప్రకటనలు, బ్యానర్ల అనుమతులు, వాటికైన ఖర్చు లెక్కవేయడం, నాయకుల ఉపన్యాసాలు మొదలైనవన్నీ ఫ్లయింగ్ స్క్వాడ్ వీడియోల ద్వారా వీవింగ్ టీమ్ గుర్తిస్తుందని చెప్పారు. ఎమ్‌సిసి టీమ్ మోడల్ కోడ్‌ను గమనిస్తుందన్నారు. వీటన్నింటి నుండి వచ్చిన అంశాలు, అభ్యర్థులు సమర్పించిన డాక్యుమెంట్లను బేరీజు వేసి చూస్తుందన్నారు. వివిధ పత్రికల్లో వచ్చిన ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌ను గుర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారి గోవిందరాజులు, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి మంజులవాణి, డిఎల్‌డిఓ నాగలక్ష్మి, సిపిఓ రామారావు, పౌర సరఫరాల శాఖ డిఎం జయంతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రశాంత ఎన్నికలకు పాత్రికేయులు సహకరించాలి

పరవాడ : అనకాపల్లి జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిబంధనకు లోబడి జరిగేందుకు పాత్రికేయులు సహకరించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ.మురళీకృష్ణ పిలుపునిచ్చారు. ఎపియుడబ్ల్యుజె జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సార్వత్రిక ఎన్నికలు-జర్నలిస్టుల పాత్ర అనే అంశంపై పరవాడ మండలం లంకెలపాలెం సాయినాథ్ ఫంక్షన్ హాల్లో మంగళవారం విలేకరులకు ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో మీడియా పాత్ర చాలా కీలకమని, విలేకరులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన ఉండాలని కోరారు. ముందుగా డిపిఆర్‌ఓ సాయిబాబా ఎన్నికల సమయంలో ఎటువంటి వార్తలు రాయాలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పరవాడ డిఎస్పీ కెవి సత్యనారాయణ, సీఐ బాల సూర్యారావు, పాత్రికేయుల సంఘాల నాయకులు, అనకాపల్లి, చోడవరం, ఎలమంచిలి, మాడుగుల, నక్కపల్లి, అచ్యుతాపురం, సబ్బవరం, మునగపాక, కశింకోట, మండలాల ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి అభ్యర్థి పైలా ప్రసాదరావు

టిడిపి కేడర్‌తో పైలా సమావేశం

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని మేడిచర్ల గ్రామంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలతో మాడుగుల నియోజకవర్గ టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి పైలా ప్రసాదరావు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధిష్టానం ఆదేశాల ప్రకారమే తను దశాబ్దాలుగా నడుచుకున్నానని, పార్టీ ఎవరి వెనుక వుండమంటే వారి వెంటే నడిచానని తెలిపారు. తనపై నమ్మకంతో ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం రావడం ఒక బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. ఒకప్పుడు టిడిపికి కంచుకోటగా వున్న మాడుగుల నియోజకవర్గంలో పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఓటమి తథ్యమన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు రొంగలి మహేష్, మాజీ ఎంపిపిలు, మాజీ జెడ్‌పిటిసిలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ప్రస్తుత ఎంపీటీసీలు, సర్పంచులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కోర్ కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి -కశింకోట : కసింకోట మండలంలోని సోమవరం, గొబ్బూరు, చెరకం, తీడ, కర్పూరపాలెం, సుందరయ్యపేట, జి.భీమవరం, అడ్డాం, అచ్చేర్ల తదితర గ్రామాల్లో మంగళవారం టిడిపి, బిజెపి, జనసేన పార్టీల కోర్ కమిటీలను నియమించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు కూండ్రపు రామునాయుడు, నిమ్మదల సన్యాసినాయుడు, గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిని రమణమూర్తి, బుద్ధిరెడ్డి చిన్న, కాయల మురళీ, కరక సత్యనారాయణ. సిరిరెడ్డి శ్రీను, కర్రి సత్యనారాయణ, కలగ సోమేశ్వరరావు, నైనంశెట్టి రమణారావు, కన్నూరు అక్కునాయుడు, చిటిమిరెడ్డి ఈశ్వరరావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

నేడు కనక మహాలక్ష్మి తీర్థం

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో శ్రీకనక మహలక్ష్మి అమ్మవారి 19వ తీర్థ మహోత్సవం బుధవారం జరుగుతుందని అనకాపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్, ఆలయం కమిటీ ఛైర్మన్ గొల్లివిల్లి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీర్థం సందర్భంగా మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

టిడిపి నాయకులతో ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ మంగళవారం స్థానిక రింగ్ రోడ్డులోని టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు అధ్యక్షతన పట్టణ, వార్డుల అధ్యక్ష కార్యదర్శులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ కూటమి జెండాలు వేరైనప్పటికీ అందరి అజెండా ఒకటేనన్నారు. వైసిపి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని తెలిపారు. ఈ ప్రభుత్వానికి ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం 20 ఏళ్ళు వెనక్కి వెళ్లిందన్నారు. అందరూ ఆశీర్వదిస్తే అనకాపల్లిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు డాక్టర్ నారాయణరావు, నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, నీలబాబు, బోడి వెంకట్రావు, కుప్పిలి జగన్, కోట్ని రామకృష్ణ, రత్నకుమారి, పొలిమేర నాయుడు, కర్రి బాబీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ తరలింపు రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్ర ప్రధాన సమాచార కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం అనకాపల్లి జాయింటు సబ్ రిజిస్ట్రారు కార్యాలయం తరలింపు రికార్డులను ఆర్టీఐ చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులోని 22 పేజీల సమాచారాన్ని ఆయనకు జిల్లా రిజిస్ట్రార్ సిహెచ్.జానకీదేవి అందజేశారు. సబ్ రిజిస్ట్రారు కార్యాలయం తరలింపు ఫైళ్లు పరిశీలన విషయమై రాష్ట్ర సమాచార కమిషన్‌లో దాఖలైన కేసు ఈ నెల 15న జరిగిన విచారణ సందర్భంగా కాండ్రేగుల వెంకటరమణను తక్షణం రికార్డుల పరిశీలనకు అనుమతించాలని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ (ఎస్‌సిఐసి) ఆర్.మహబూబ్ బాషా ఆదేశించారు. ఈ నేపథ్యంలో రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులేకుండా ప్రజలకు అందుబాటులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పట్టణానికి శివారు ఎన్‌హెచ్.-16 కొత్తూరు జంక్షన్‌కు స్వీయ ప్రయోజనాలను ఆశించి తరలించారని ఆరోపించారు. ఈ విషయం రికార్డుల పరిశీలనలో బహిర్గతమైందన్నారు. దీనికి బాధ్యులైన అధికార యంత్రాంగంపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని, దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు వెల్లడించారు.



గంజాయి వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి సత్యనారాయణ

32 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అనకాపల్లి-ఆనందపురం 16వ నెంబర్ జాతీయ రహదారిలో అసకపల్లి వద్ద మంగళవారం ఉదయం ఆటోలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు పరవాడ డిఎస్పి కెవి సత్యనారాయణ మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డిఎస్‌పి తెలిపిన వివరాలు ప్రకారం... చింతపల్లి నుండి చోడవరం, సబ్బవరం మీదుగా తునికి ఆటోలో తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు స్థానిక సిఐ పిన్నింటి రమణ ఆధ్వర్యాన సిబ్బందితో అసకపల్లి వద్ద దాడి చేసి పట్టుకున్నారు. 16 ప్యాకెట్లలో ఉన్న 32 కేజీలు శీలావతి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1,60,000 ఉంటుందని తెలిపారు. గంజాయి తరలిస్తున్న నిందితులు అల్లూరి జిల్లా చింతపల్లి మండలం మల్లవరంకి చెందిన కిల్లో గిరిబాబు, వంతల చంటిబాబు, వంతల కోటేశ్వరరావులను అరెస్ట్ చేశారు. వారి నుండి రెండు సెల్ ఫోన్లు, ఆటోను స్వాధీన పరచుకొని కోర్టుకు తరలిస్తున్నట్లుగా డిఎస్‌పి తెలిపారు. పెదబయలు మండలం వనబంగి గ్రామానికి చెందిన వంతల సూరిబాబు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ధనుంజయ, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యపై దాడి కేసులో
భర్త, కుటుంబ సభ్యులకు జైలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బోదువలస గ్రామానికి చెందిన భార్యాభర్తల తగాదాలో భార్యపై క్రూరంగా దాడి చేసిన భర్తకు, మరిదికి, ఆడపడుచుకు అనకాపల్లి 12వ ఎఎంఎం కోర్టు జడ్జి బివిబి విజయలక్ష్మి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు స్థానిక సిఐ పిన్నింటి రమణ తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు ప్రకారం... 2020 ఆగస్టు 7న మండలంలోని బోదువలస గ్రామంలో నేబర్తి త్రివేణిపై ఆమె భర్త నేబర్తి శ్రీనివాస్, మరిది నేబర్తి రమేష్, ఆడపడుచు బెల్ల పద్మ గొడవ పడి క్రూరంగా కొట్టారు. దీనిపై బాధితురాలు ఫిర్యాదు మేరకు అనకాపల్లి 12వ ఎఎంఎం కోర్టు జడ్జి విచారణ జరిపి, ఐపిసి 498ఎ సెక్షన్ ప్రకారం ముద్దాయిలకు ఒక సంవత్సరం జైలు శిక్షణ, రూ.5000 జరిమానా, 323 ఐపిసి సెక్షన్ ప్రకారం నెలరోజులు జైలు, 500 జరిమానా విధించినట్లుగా సిఐ తెలిపారు.

గ్రామీణ వ్యవసాయంపై అవగాహన


రైతులకు వివరిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగే గ్రామీణ వ్యవసాయ అనుభవం కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం కింజరాపు యర్రన్నాయుడు వ్యవసాయ కళశాల విద్యార్థినులు మండలంలోని బంగారుమెట్ట గ్రామంలో గ్రామీణ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వ్యవసాయానికి సంబంధించిన కార్యాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, పాఠశాల, అంగన్‌వాడీ వంటి ఇతర సదుపాయాలు, రవాణ సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సభ్యులు డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ ఎన్.కిషోర్ కుమార్, డాక్టర్ పి.బాబు, వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ఎంఎస్ఎస్.మధురిమ, ఎం.సోనీ, ఎల్.రత్న ప్రశాంతి, సి.వాత్సల్య, వై.శ్రీవిష్ణుప్రియ, కె.యమున, రైతులు పాల్గొన్నారు.

పంట తెగుళ్లపై అవగాహన

కె.కోటపాడు : పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం ఏడి డాక్టర్ రాజకుమార్ అన్నారు. మండలంలోని వారాడలో గ్రామీణ వ్యవసాయ పని అవగాహన, అనుభవం అనే కార్యక్రమం ద్వారా శ్రీకాకుళం కింజరాపు యర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు పలు సూచనలు చేశారు. నువ్వులు పంటలో వచ్చే ఆకు మచ్చ తెగులు యొక్క లక్షణాలు, దాని యొక్క యాజమాన్య పద్ధతులు గురించి రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు ఆఫ్రిద్, రమణ, రవికుమార్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక పాఠశాల ప్రవేశ పరీక్షలో ఎయిమ్స్ విద్యార్థులకు ర్యాంకులు

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని తానాం గ్రామంలో ఉన్న ఎయిమ్స్ నవోదయ, సైనిక్ స్కూల్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు సైనిక పాఠశాల ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు సాధించారు. ఈ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన వెంకటపురానికి చెందిన రేబాక పార్థివ్, తానాం గ్రామానికి చెందిన కట్టా తేజ, కట్టా సురేంద్ర, కిరణ్,. మౌళి 9వ తరగతికి, ఎండ షణ్ముఖ, శివప్రియ ఆరవ తరగతికి సైనిక స్కూల్ ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి అర్హత సాధించినట్లు ఎయిమ్స్ కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకుడు వర్రి చంద్రశేఖర్ తెలిపారు. కోచింగ్ సెంటర్ ప్రారంభించిన అతి తక్కువ సమయంలోనే ఆరుగురు విద్యార్థుల్లో నలుగురు విద్యార్థులు సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంకులు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. రాబోవు కాలంలో మరింత మంది పేద మధ్యతరగతి విద్యార్థులు నవోదయ, సైనిక పాఠశాలలో అర్హత సాధించే విధంగా ప్రయత్నం చేస్తానని చెప్పారు. సైనిక స్కూల్‌కు అర్హత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

- పురవీధుల్లో పెండ్లి కావిడి ఊరేగింపు
- నేటి రాత్రి వెంకన్న కల్యాణం



బందోబస్తులో నిమగ్నమైన పోలీసులకు సూచనలు చేస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి-నక్కపల్లి : ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలకు మంగళవారం ఉదయం శ్రీకారం చుట్టారు. స్వామి కల్యాణానికి అహ్వానం పలుకుతూ పురవీధుల్లో పెండ్లి కావడి ఉత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యుల, అర్చకులు కష్ణమాచార్యులు శేషాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పెళ్ళికావిడి ఊరేగింపులో భక్తులు అనవాయితీ ప్రకారం పసుపు, కుంకం, కొబ్బరి బొండాలు సమర్పించారు. సాయంత్ర వార్షిక కల్యాణం ప్రారంభ సూచికంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు వెంకన్న కల్యాణం


ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద బుధవారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి ఎదురునన్నాహ ఉత్సవం, రథోత్సవం జరుగుతుంది. అనంతరం అర్ధరాత్రి ఆలయం వద్ద కల్యాణ.వేదికలో ఉభయ దేవరులతో స్వామి కల్యాణోత్సవం జరుగు తుంది. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు కల్యాణ తిలకించేందుకు రానున్న నేపథ్యంలో టిటిడి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. స్వామి విలువైన బంగారు ఆభరణాలను ట్రెజరీ నుండి మంగళవారం పోలీస్ బందోబస్తు నడుమ తీసుకువచ్చారు.శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామికి అలంకరించారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు

వెంకన్న కల్యాణోత్సవాలు సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసారు. డిఎస్‌పి జెఆర్ఆర్ మోహన్, ఆరుగురు సిఐలు, 20మంది ఎస్ఐల పర్యవేక్షణలో 150మంది పోలీసులు బందోబస్తు కల్పించారు. స్వామి తిరువీధి సేవలు, రథోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపడుతున్నారు. ఉపమాకలో వాహనాల పార్కింగ్‌పై పోలీసులు ఆంక్షలు విధించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని స్థానిక సిఐ విజయ్ కుమార్ సూచించారు.

ఇత్తడి గజ వాహనం బహూకరణ

నక్కపల్లి : ఉపమాక వెంకన్నకు కాకినాడ జిల్లా, మండపేటకు చెందిన జె.వెంకటేశ్వరరావు దంపతులు రూ.రెండు లక్షలతో తయారు చేయించిన ఇత్తడి గజ వాహనాన్ని కల్యాణోత్సవాల సందర్భంగా బహూకరించారు. దీనిని ఆలయ అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ చిలువూరి రామ సూర్యనారాయణ రాజు(పెంకుల రాజు), భక్తులు పాల్గొన్నారు.



ఇత్తడి గజ వాహనం బహూకరిస్తున్న దాతలు

'ఉక్కు' ప్రైవేటీకరణ ఆపాలి

1132వ రోజుకు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ దీక్షలు



దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

ప్రజాశక్తి - ఉక్కునగరం : రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1132వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఇన్ ఎండ్ ఎఫ్, ఇఎండి, సేఫ్టీ, టెక్, సెల్, ఆగ్రో, ఫారెస్ట్ విభాగాల ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ ఢిల్లీలో జరుగుతున్న ఎన్‌జెసిఎస్ సమావేశంలో విశాఖ స్టీల్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలన్న నిర్ణయం తీసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలను విడనాడి సొంత గనులు కేటాయించాలన్నారు. కర్మాగారంలో పూర్తి స్థాయి ఉత్పత్తి జరిగేలా అన్ని చర్యలూ చేపట్టాలన్నారు. ఉక్కు ఉత్పత్తిలో నిరంతరం శ్రమిస్తున్న వారికి వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు గంగాధర్, నీలకంఠం, బొంజు బాబు, గోవింద్, బంటు రాము, గణేష్, దుర్గాప్రసాద్, రమణ, కనకరాజు, దేముడు, కారు రమణ పాల్గొన్నారు.

బాబు గ్యారెంటీ పథకాలపై ప్రచారం



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- నక్కపల్లి : తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి రాష్ట్రంలో అధికారంలోకొస్తే ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని దోసలపాడు గ్రామంలో ఉపాధి కూలీలకు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పథకాలపై అవగాహన కల్పించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థి వంగలపూడి అనితను గెలిపించాలని కోరారు. వైసిపి పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, అవినీతి కూపంలా మారిందని ఆరోపించారు. పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కోట్నాపల్లి హైవే క్వారీ నిలిపివేత

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని కొట్నపల్లి హైవే రాయి క్వారీ నిలుపుదల చేస్తూ మైనింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారని అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు తెలిపారు. ఈ మేరకు మైనింగ్ డిడితోపాటు పాడేరు ఆర్‌డి రాంబాబు, ఇతర అధికారుల నుంచి తనకు ఫోనుద్వారా సమాచారం అందిందన్నారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, కొట్నాపల్లి హైవే వద్ద క్వారీతో పరిసర ప్రాంతాల ప్రజలు దుమ్మూధూళితో పడుతున్న ఇబ్బందులపై విశాఖపట్నం జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశంలో ప్రస్తావించడంతోపాటు కొట్నపల్లి హైవే క్వా తో ప్రజలకు జరుగుతున్న నష్టంపై స్థాయి సంఘం చైర్మన్ వరహసత్యవతి, జెడ్‌పి సిఇఒ పోలినాయుడులకు ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి, పాడేరు సబ్ కలెక్టర్ భావన వశిష్ట ఆదేశాల మేరకు క్వారీ తాత్కలింగా నిలుపుదల చేశామని, మైనింగ్ డిడి, ఇతర అధికారులు ఫోనులో తెలిపారని గంగరాజు తెలిపారు.ప్రజల పక్షాన వారి సమస్యలపై పోరాటానికి సిపిఎం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని గంగరాజు తెలిపారు. హుకుంపేట వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు, సిపిఎం మండల కార్యదర్శి, మెరకచింత మాజీ సర్పంచ్ వలసనైని లక్ష్మణరావు, కొట్నపల్లి సిపిఎం నేతలు పాంగి కేశవరావు, మజ్జి బాలకృష్ణ, గొల్లోరి అప్పలస్వామి, పాంగి సుమన్ పాల్గొన్నారు.

చీడిగుమ్మల ఘటనపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామంలో జరిగిన ఘటనపై బాధితుల తరపున టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మంగళవారం ఎస్ఐ కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ, వైసిపి నేతలతో కలిసి వాలంటీర్లు ఎన్నికల ప్రచారంలో అత్యుత్సాహం చూపడం వల్ల వారు తీవ్రంగా నష్టపోతారన్నారు. వాలంటీరు ఉద్యోగం కోల్పోవడమే కాకుండా, మున్ముందు ఎటువంటి ప్రభుత్వం, ప్రయివేటు ఉద్యోగాలకు అర్హులు కాకుండా పోతారన్నారు. ఇప్పటికైనా అత్యుత్సాహం మానుకోవాలని, ఎన్నికల నిబంధనలను ఎంతటివారైనా పాటించాల్సిందేనని విజయ్ అన్నారు. టిడిపి మండల అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.



ఎస్ఐతో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

21న శోభన్‌బాబు చిత్ర గీతాల సంగీత విభావరి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 21న నట భూషణ్ శోభన్ బాబు 16వ వర్ధంతి సందర్భంగా శోభన్ బాబు చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు ఘంటసాల స్పోర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను మంగళవారం సాయంత్రం ఎంవిపి.కాలనీలోగల సంస్థ కార్యాలయంలో సినీ నిర్మాత, ఉపకార్ సేవా ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ ద్వారకా నగర్ విశాఖ పౌర గ్రంథాలయంలో జరిగే సినీ సంగీత విభావరిలో ప్రముఖ గాయకులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు బొమ్మిడి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి ఇందిరా సాహిణి తదితరులు పాల్గొన్నారు.

రూ.500 కోట్ల క్రైస్తవ భూమి ఆక్రమణ

కేసు వేసి ఎంపీ ఎంవివిని జైలుకు పంపిస్తా : ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు డాక్టర్ కె.ఎ.పాల్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పార్లమెంట్ సభ్యుడు ఎంవివి.సత్యనారాయణను జైలుకి పంపిస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు డాక్టర్ కె.ఎ.పాల్ అన్నారు. రైల్వే న్యూ కాలనీలోగల పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ ఎంవివి రూ.500 కోట్ల విలువైన క్రైస్తవ భూమి ఆక్రమించారన్నారు. ఆయన మీద కేసులు వేసి జైలుకు పంపిస్తానని హెచ్చరించారు. చంద్రబాబుపై పాల్ విమర్శలు చేశారు. సినీ నటుడు బాబూమోహన్ తమ పార్టీ తరపున వరంగల్ నుంచి పోటీ చేస్తారన్నారు. తాను ఎస్.కోట, పిఠాపురం నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని పార్టీలో పలువురు కోరుతున్నారన్నారు. బిజెపి అంటే బాబు, జగన్, పవన్ కల్యాణ్ అని ఎద్దేవా చేశారు. 33 అంశాలతో త్వరలో ప్రజాశాంతి పార్టీ మ్యానిఫెస్టో విడుదల కానుందన్నారు. మీడియా సమావేశంలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రవి కుమార్ పాల్గొన్నారు.

నాగరాజు మృతికి బూడి సంతాపం



నాగరాజు మృతదేహానికి నివాళులర్పిస్తున్న బూడి

ప్రజాశక్తి - మాడుగుల: వైసిపి సీనియర్ నేత, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు ఇందుకూరి నాగరాజు మంగళవారంగుండెపోటుతో మరణించారు. సత్యవరం గ్రామంలో నాగరాజు మృతదేహానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీకి, ప్రజలకు నాగరాజు చేసిన సేవలను కొనియాడారు. బూడితోపాటు పలువురు వైసిపి నేతలు, కార్యకర్తలు, స్థానికులు సంతాపం వ్యక్తం చేశారు.

పాము కాటుతో బాలునికి అస్వస్థత

ప్రజాశక్తి - అనకాపల్లి డెస్క్ : రావికమతం మండలం మేడివాడ గ్రామానికి చెందిన గొర్లె హర్ష అనే పన్నెండేళ్ల బాలుడు సోమవారం పాము కాటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గొర్లె నానాజీ (వందల నాయుడు) కుమారుడైన హర్ష వ్యవసాయ పాకల వద్ద ఆడుకుంటుండగా, పాము కాటుకు గురయ్యారు. హుటాహుటిన రావికమతం పిహెచ్‌సికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు.

చోరీలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - అనకాపల్లి డెస్క్ : విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో చెడ్డీగ్యాంగ్ హల్‌చల్ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రావికమతం ఎస్ఐ ధనంజయరావు సూచించారు. విజయనగరానికి సమీపంలో ఎపిఎస్‌పి ఐదవ బెటాలియన్ చేరువలో హైవేలో నలుగురు సభ్యుల చెడ్డీగ్యాంగ్ బృందం ఇంటితలుపుకు కన్నవేసి, లోపలకు చొరబడి చోరీకి పాల్పడమే కాకుండా, అడ్డొచ్చిన యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల సంచారంపై నిఘాపెట్టి, అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పరిసర ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తుల సంచారంపై డయల్ 100కుగానీ, పోలీస్‌స్టేషన్‌కు గానీ ఫిర్యాదు చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించండి

◆ సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు

ప్రజాశక్తి -హుకుంపేట: ప్రజల కోసమే నిరంతరం శ్రమిస్తున్న సిపిఎం తరపున అరుకులో పోటీచేయనున్న అభ్యర్థిని మంచి మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. మంగళవారం హుకుంపేటలో నిర్వహించిన సిపిఎం మండల నాయకుల సమావేశంలో మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, వారి సంక్షేమం కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న సిపిఎం అభ్యర్థులకు ఓటేసి గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చట్టసభల్లో సిపిఎం వాణి వినిపించిన నాడే ఎన్నో ప్రజాసమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఏజెన్సీలో జిఒ 3పునరుద్ధరణ, గిరిజన చట్టాలు పటిష్ట అమలుకు నోచుకోవాలంటే అది సిపిఎంతోనే సాధ్యమన్నారు.

అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, గిరిజనాభివృద్ధి సిపిఎంతోనే సాధ్యమన్నారు. అనంతగిరి జెడ్‌పిటిసిగా తాను, హుకుంపేట, ముంచంగిపుట్టులలో పలువురు సిపిఎం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న వైస్ ఎంపిపిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఇతర పార్టీల ప్రజాప్రతినిధుల కంటే ప్రజాసేవలో ఎంతో ముందంజలో ఉన్నారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించుకుంటే ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు సక్రమ వినియోగం, పివిటిజిలకు ఐఎపి, సిసిడిపి నిధులు, ఉద్యోగులకు కనీస వేతనాల అమలు, గిరి ప్రాంతాల్లో తాగునీరు, రోడ్లు, వైద్యం, విద్య వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఆస్కారమంటుందన్నారు. హుకుంపేట వైస్‌ఎంపిపి సూడిపల్లి కొండలరావు, జిల్లా నాయకులు సొంట్యాన హైమావతి, మండల కార్యదర్శి మెరకచింత, గన్నేరుపుట్టు మాజీ సర్పంచ్‌లు వలసనైని లక్ష్మణరావు, సూడిపల్లి లక్ష్మీప్రమీల, మండల నాయకులు అప్పలకొండ పడాల్, రమణ మూర్తి, బాలకృష్ణ, కేశవరావు, చిట్టిబాబు, బుజ్జిబాబు, మొత్తి రాము, బాలకృష్ణ, అప్పలస్వామి, నాగేశ్వరరావు, సూరిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

టిడిపిలో 30 కుటుంబాల చేరిక

◆ చెట్టుపల్లి సర్పంచ్, వార్డు సభ్యులను పార్టీలోకి ఆహ్వానించిన అయ్యన్న


మాజీ మంత్రి అయ్యన్న సమక్షంలో టీడీపీలో చేరిన వైసిపి నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : నర్సీపట్నం నియోజకవర్గంలోని చెట్టుపల్లి సర్పంచ్ గజాల నూకరత్నం, మాజీ ఎంపిటిసి గజాల సూరిబాబుతో పాటు పలువురు వార్డు మెంబర్లు కరణం రాంబాబు, బంటు రమణ, కంట్రెడ్డి లక్ష్మి, వెలంకాయల నూకరత్నం, చెల్లురి అప్పారావు, సీనియర్ కార్యకర్తలు వల్లూరు నాగేశ్వరరావు, గల్లా సూరిబాబు, బంటు సత్తిబాబు, సేనాపతి అప్పారావుతో మొత్తం 30 కుటుంబాలు మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం అయ్యన్న మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి చింతకాయల విజయ్, జెడ్‌పిటిసి సుకల రమణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఎస్ఐ

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : గొలుగొండ మండలంలోని రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాలను మంగళవారం ఎస్ఐ బి. కృష్ణారావు మంగళవారం సందర్శించారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, పరీక్షలకు గట్టి బందోబస్తు కల్పించామన్నారు మాస్ కాఫీయింగ్‌కు అవకాశం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు.

బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థిగా నాగరాజు



నాగరాజుకు సంఘీభావంగా బిఎస్‌పి నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : నర్సీపట్నం నియోజకవర్గ బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థిగా బొట్టా నాగరాజును పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి ప్రకటించారు. విజయవాడలో మొదట విడతలో ప్రకటించిన 50 మంది బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థుల్లో నాగరాజు ఉన్నారు.

ఈ సందర్భంగా బొట్టా నాగరాజు మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంలో బిఎస్‌పి తరపున పోటీకి అవకాశమిచ్చిన జాతీయ అధ్యక్షురాలు మాయావతికి, రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతికి, రాష్ట్ర కన్వీనర్ పూర్ణచంద్రరావు, నర్సీపట్నం నియోజకవర్గ కమిటీకి, స్థానిక నాయకులు, బహుజన వాదులు, ప్రజలందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సాదారణ కుటుంబం నుంచి వచ్చిన కూలీబిడ్డనైన తనకు అసెంబ్లీలో పోటీకి అవకాశం ఇవ్వడం, తొలిజాబితాలోనే పేరు ప్రకటించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఏనుగు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇతర రాజకీయ పార్టీల్లా కార్పొరేట్లు, పారిశ్రామిక వేత్తల నుంచి ఎలక్టోరల్ బాండ్లు, విరాళాలను తీసుకుని పోటీలో నిలిచే సంస్కృతి బిఎస్‌పిది కాదని, వ్యవస్థాపకుడు కాన్సీరాం ఆనాడే పిలుపునిచ్చినట్లుగా ఒకనోటిచ్చి ఒక ఓటు వేయడం ద్వారా తనను బలపరచాలని నాగరాజు అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ గంగాధర్, వైస్ ప్రెసిడెంట్ అప్పలనాయుడు, యువజన అధ్యక్షులు సూరిబాబు, సీనియర్ నాయకులు అప్పారావు, యూత్ నాయకులు ఆది, నాయుడు పాల్గొన్నారు.

వైసిపి నేతల అక్రమాలపై చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న ఎంపిటిసి రామకృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : గొలుగొండ మండలం ఏఎల్ పురంలో వైసిపి నేతలు, ప్రజాప్రతినిధుల అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఏఎల్ పురం ఎంపిటిసి రుత్తల రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ తనకు భూములు లేవని, కౌలు రైతును కూడా కాకపోయినా తనపేరున రైతు భరోసా రూ.13,500 వచ్చినట్లు ప్రభుత్వం లెక్కలో చూపించి, వాలంటీరు ఇచ్చిన బ్రోచర్లలో ఉండడం దారుణమన్నారు. ఇలాగే ఎందరో బినామీ రైతుల పేరిట రైతుభరోసా, ఇతర పథకాలను తీసుకుని లక్షల్లో ప్రభుత్వానికి మోసపుచ్చారని ఆరోపించారు. గ్రామంలో వలంటీర్లకు, పెళ్ళికాని యువకులకు, సొంతిళ్లు ఉన్నవారికి, గతంలో ఇళ్లు మంజూరైన వారికి ఇపుడు జగనన్న ఇళ్లస్థలాలు, హౌసింగ్ పథకాలను అడ్డగోలుగా అందజేసి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వికలాంగుడినైన తనకు ఇంటిస్థలం ఇవ్వాలని కోరగా, సర్వే చేశారని, చివరకు తాను పార్టీ మారాననే అక్కసుతో స్థలంగానీ, పట్టాగానీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రభుత్వపథకాల అమలులో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై దర్యాప్తు చేసి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమలో స్కూల్ కమిటీ ఛైర్మన్ గొర్లి లక్షణ్, టిడిపి నాయకులు లగుడు రాజు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగుదాం

◆ పరిచయ కార్యక్రమంలో టిడిపి అభ్యర్థి పైలా



ప్రసాదరావుకు జ్ఞాపికను అందజేస్తున్న జనసేన నేతలు

ప్రజాశక్తి- చీడికాడ : వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టిడిపి, జనసేన, బిజెపి నేతలు, కార్యకర్తలంతా సమన్వయంతో ముందుకు సాగుదామనిమాడుగుల అసెంబ్లీ టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి పైలా ప్రసాదరావు పిలుపునిచ్చారు. మంగళవారం చీడికాడ జనసేన కార్యాలయంలో జనసేన నేతలు, కార్యకర్తలతో టిడిపి అభ్యర్థి పైలా పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పైలా మాట్లాడుతూ, మాడుగులో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఓటమి లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇప్పటికే టిడిపి నేతలు పివిజి కుమార్, గవిరెడ్డి రామానాయుడులను కలిశానన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు, బాబూష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాయపురెడ్డి కృష్ణ, మండల అధ్యక్షులు జివి.మూర్తి. వైస్ ప్రెసిడెంట్ దిబ్బిడి సన్యాసినాయుడు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసి నాయుడు, పేరపు కొండబాబు, రెడ్డి రాము, దొగ్గ బలరాం, కామిరెడ్డి ఎరుకు నాయుడు, పేరపు అప్పారావు, పాతాళం ఎర్రునాయుడు, నడుపూరు ముత్యాలు దుర్గ పాల్గొన్నారు

'జ్ఞాపకాల దొంతర' కవితకు ప్రథమ బహుమతి

◆ వర్చువల్ కవి సమ్మేళనంలో పంచదార్ల మాణిక్యాలరావు ప్రతిభ


పంచదార్ల మాణిక్యాలరావు

ప్రజాశక్తి -పాయకరావుపేట : అంతర్జాతీయ అంతర్జాలంలో 'నిదురపోను నేస్తమా' అంశంపై నిర్వహించిన కవి సమ్మేళనంలో తునికి చెందిన భావకవి పంచదార్ల మాణిక్యాలరావు 'జ్ఞాపకాల దొంతర' కవితకు ప్రథమ బహుమతి వరించింది. ఈ నెల 17న నిర్వహించిన ఆన్‌లైన్‌లో వర్చువల్‌గా నిర్వహించిన అంతర్జాల కవి సమ్మేళనంలో ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి నుంచి 500 మంది కవులు పోటీలో పాల్గొనగా, మాణిక్యాలరావు ప్రథమ బహుమతి సాధించారు. తెలుగు వెలుగు సాహిత్యవేదిక, ఎపి అధ్యక్షులు మీసాల చిన గౌరినాయుడు అధ్యక్షతన జరిగిన కవితా సమ్మేళనంలో కిలపర్తి దాలినాయుడు, మోటూరి నారాయణ రావు, డాక్టర్ రమాదేవి, డాక్టర్ చొప్పదండి రాధ, డాక్టర్ నవనీత రవీందర్, డాక్టర్ .బేతా శారదాదేవి, డాక్టర్ బాలచంద్ర సాదే, డాక్టర్ పిఆర్‌ఎస్ఎన్ .మూర్తి న్యాయ సమీక్షకులుగా వ్యవహరించి, కవితా ప్రతిభలో టాప్ 25 కవులను ప్రకటించగా, వారిలో మాణిక్యాలరావుకు ప్రథమస్థానం దక్కడంపై కవి,ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ యాజ్ఞవల్క్య శర్మ హర్షం వ్యక్తం చేసి, అభినందించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయండి


మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మంగళవారం మీడియాకు విడుదల చేసిన వీడియోలో, పాసు పుస్తకాలు, సర్వే రాళ్లపై, ఇళ్ల పట్టాలపై జగన్ ఫొటోలు ఉన్నాయన్నారు. టిడ్కో గృహాలకు వేసిన వైసిపి రంగులు తీయలేదని, చాలా గ్రామాల్లో వాటర్ ట్యాంకులకు, అంగన్వాడీ భవనాలకు వేసిన వైసిపి రంగులు తొలగించలేదన్నారు. దీనిపై ఫొటోలు తీసి ఎన్నికల కమిషన్‌కు, కలెక్టర్, ఆర్‌డిఒలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు.

ఘనంగా మోదకొండమ్మ పండగ

◆ ఘటాన్ని ఎత్తుకుని మొక్కు తీర్చిన బూడి

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ శ్రీనాథ శ్రీనివాసరావు, పరమేశ్వరి దంపతులు మోదకొండమ్మ మొక్కును మంగళవారం తీర్చుకున్నారు. ఈసందర్భంగా నిర్వహించిన వేడుకలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొని, మోదమాంబ ఘటాలు తలపై ఎత్తుకొన్నారు. శ్రీనివాసరావు ఇంటి నుంచి గుడి వరకు 58 ఘటాలతో భక్తులు కోలాటాలు, తప్పెటగుళ్లు, డిజె మోతలతో ఊరేగింపుగా మొక్కు తీర్చుకునేందుకు వెళ్లగా, తపై ఘటాలతో బూడి పాల్గొన్నారు.